ప్రజాశక్తి

సోమవారం 30 సెప్టెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉక్కు కార్మికాగ్రహం

- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, కార్మికుల తొలగింపును నిరసిస్తూ పాదయాత్ర
- కూర్మన్నపాలెం నుంచి పెదగంట్యాడ వరకూ వేలాది మంది నడక
- ఐక్య పోరాటాలతో కర్మాగారాన్ని రక్షించుకుంటామన్న నాయకులు



ఉక్కు కార్మికుల పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న జగ్గునాయుడు, కుమార్

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక

ఉక్కు కార్మికులు పిడికిలెత్తారు. తమ ఉపాధి జోలికొస్తే ఖబడ్దార్ అని కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని, స్టీల్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తి సామర్థ్యంతో నడపాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని పూర్తిగా విరమించుకోవాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, ప్లాంట్‌కు కావాల్సిన ముడి సరుకు, నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఉక్కు కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు ఆదివారం మహా పాదయాత్ర నిర్వహించారు. కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు పరిరక్షణ దీక్షా శిబిరం నుంచి వడ్లపూడి, పాత గాజువాక, పెదగంట్యాడ నెల్లిముక్కు స్టేజీ వరకూ మిగతా 2లో..

గంజాయి చాక్లెట్లు స్వాధీనం

- ఒకరు అరెస్టు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం సిటీ టాస్క్‌ఫోర్స్ అధికారులు నగరంలో గంజాయి చాక్లెట్లును ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. వారి కథనం మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల పూర్ణా మార్కెట్ క్రాంతి థియేటర్‌కు ఎదురుగా ఉన్న పాన్ షాపులో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 133 గంజాయి చాక్లెట్లు (660 గ్రాములు) స్వాధీనం చేసుకొని, నిందితుడు మనోజ్ కుమార్ చౌదరిని అరెస్ట్ చేశారు. అతనిపై ఎన్‌డిటిఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. తనిఖీల్లో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ భరత్, టూ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఇతర పోలీసు సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

విశాఖ రైల్వేజోన్‌కు

హైడ్రామాల ప్రహసనం ముగిసినట్టేనా ?

ముడసర్లోవ వద్ద 52 ఎకరాలు సిద్ధం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే (సౌత్ కోస్ట్) జోన్‌కు కేంద్రం కొర్రీల పర్వం ముగిసినట్టేనా ?... అంటే అవుననే సమాధానం రైల్వే ఉన్నతాధికారుల నుంచి తాజాగా వినిపిస్తోంది. జోన్ కోసం అవసరమైన 52 ఎకరాలూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి హ్యాండోవర్ కాలేదంటూ మోడీ సర్కారు 2019 నుంచీ చెప్పుకొచ్చిన సంగతి తెలిసిందే. వాస్తవానికి 2014 నాటి మోడీ ఎన్నికల హామీ ఇది. పలు మార్లు ఇదిగో శంకుస్థాపన, భూమి పూజ అంటూ 2019 ఫిబ్రవరి 27న కేంద్రం రైల్వే జోన్ ఏర్పాటును ప్రకటించింది. ఆ ఎన్నికల ముందూ ఆయుధంగా వాడుకుంది. 2023 మార్చి నాటికి జోన్‌కు పునాదిరాయి పడుతుందని ఢిల్లీ పెద్దలు భరోసా ఇచ్చారు. 2024 మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా అజిత్ కుమార్ సక్సేనా



అజిత్ కుమార్ సక్సేనా (ఫైల్)

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఉక్కు మంత్రిత్వ శాఖ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా అజిత్ కుమార్ సక్సేనాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించింది. ది ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్ (ఫైనాన్స్) డైరెక్టర్ ఎస్.శక్తిమణి ప్రస్తుత స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్ నవంబర్ 30వ తేదీన రిటైర్ అయిన తర్వాత బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. అయితే, అతుల్ భట్ ఈ ఏడాది నవంబర్ చివరి వరకూ అంటే ఉద్యోగ విరమణ చేసే వరకు సెలవుపై వెళ్లారు. తప్పని పరిస్థితుల్లో డైరెక్టర్ ప్రాజెక్ట్స్‌గా పని చేస్తున్న ఎకె.బాగ్చి ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా ప్రస్తుతం బాధ్యతలు చూస్తున్నారు. అతుల్‌భట్ స్టీల్‌ప్లాంట్‌ను సమర్థవంతంగా నడిపించడంలో విఫలమైనట్టుగా కేంద్రం భావిస్తోంది. ఈ క్రమంలో ఉక్కు కర్మాగారంలో జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉన్నత అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించాలని అజిత్ కుమార్ సక్సేనాను తెరపైకి తెచ్చినట్టు తెలుస్తోంది.

గతంలో ఆయన ఆపరేషన్ డైరెక్టర్‌గా పని చేశారు. మాంగనీస్ లిమిటెడ్ సిఎమ్‌డిగా బదిలీపై వెళ్లారు. మళ్లీ స్టీల్ ప్లాంట్‌కు ఆయన ఇప్పుడు తిరిగి రావడం చర్చనీయాంశ మవుతోంది. పూర్తిస్థాయి సిఎమ్‌డి వచ్చే వరకూ సక్సేనా కొనసాగుతారని ఆదివారం కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఆరోగ్యకర సమాజానికి కృషి

- గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ప్రత్యేక దృష్టి
- పౌష్టికాహార ప్రాధాన్యతపై విస్తృత ప్రచారం
- 'ప్రజాశక్తి'తో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ అనంతలక్ష్మి





ప్రజాశక్తి - అనకాపల్లి : ఆరోగ్యకర సమాజానికి కృషి చేస్తున్నామని, జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పాటు పడుతున్నామని అనకాపల్లి జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ అనంతలక్ష్మి తెలిపారు. తనను కలిసి 'ప్రజాశక్తి'కి ఆమె పలు వివరాలు వెల్లడించారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

జిల్లాలో ఐసిడిఎస్ ప్రాజెక్టు గురించి వివరిస్తారా ?

అనకాపల్లి జిల్లాలో ఐసిడిఎస్‌కు సంబంధించి 9 ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అనకాపల్లి, రావికమతం, నర్సీపట్నం, కె.కోటపాడు, నక్కపల్లి, యలమంచిలి, వి.మాడుగుల, గొలుగొండ, సబ్బవరం మండలాల్లో ఈ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 72 సెక్టార్లు ఉన్నాయి. రెండు చిల్డ్రన్ హోమ్స్ పనిచేస్తున్నాయి.

మొత్తం అంగన్వాడీ కేంద్రాలు ఎన్ని ఉన్నాయి ? వాటిలో విద్యార్థుల సంఖ్య ఎంత ?

జిల్లాలో 72 సెక్టార్ల పరిధిలో 1725 మెయిన్ సెంటర్లు, 183 మినీ సెంటర్లు వెరసి 1908 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. 0 నుంచి ఆరు నెలల వయసుగల పిల్లలు 7102 మంది, ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వయసుగలవారు 26,137 మంది, రెండు నుంచి మూడు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆరోగ్యకర సమాజానికి కృషి

సంవత్సరాల వయసు గలవారు 18,675 మంది, మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గలవారు 20,892 మంది, గర్భిణులు 8410 మంది ఉన్నారు.

వారికి అందిస్తున్న పౌష్టికాహార వివరాలు తెలియజేయండి ?

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, ఆరు నెలలలోపు పిల్లల తల్లులకు ప్రతినెలా గుడ్లు, పాలు, మూడు కేజీల బియ్యం, కేజీ పప్పు, అరకేజీ ఆయిల్ను ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే గర్భిణులకు ప్రత్యేకించి పౌష్టికాహార కిట్లుతోపాటు చెక్కీలు, రాగి పౌడర్, గోధుమ పిండి, అటుకులు, ఖర్జూరం, బెల్లంను బాల సంజీవని పథకం ద్వారా అందజేస్తున్నాం.

ఖాళీల సంగతేంటి ?

జిల్లాలో మినీ సెంటర్లలో రెండు, మెయిన్ వర్కర్ల కేటగిరీలో 27, హెల్పర్ పోస్టులు 55 ఖాళీగా ఉన్నాయి. వీటిని అక్టోబర్ మొదటి వారంలోగా భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. జీతాలు పెండింగ్లో లేవు.

హైడ్రామాల ప్రహసనం ముగిసినట్లేనా ?

ఎన్నికల్లో బిజెపి పెద్దలు విశాఖ రైల్వే గ్రౌండ్స్లో సభ జరిపి హామీని తిరగదోడారు. ఇలా అనేక హైడ్రామాల అనంతరం ఇప్పుడు ఈ అంశం కాసింత కదిలిందనే చెప్పాలి. నగరంలోని ముడసర్లోవ ప్రాంతంలో గతంలో చూపించిన భూమి వివాదంలో ఉందని, చెరువు, లోతట్టు ప్రాంతమని వివాదం సృష్టించిన ఢిల్లీ సర్కారు తాజాగా ఒక మెట్టు దిగి వచ్చిందనే చెప్పొచ్చు. అక్కడ భూమినే కేంద్రం అంగీకరించింది. 52 ఎకరాలనూ 2023లోనే రాష్ట్ర ప్రభుత్వం చూపించగా తాజాగా దీనికి కేంద్ర పెద్దలు ఓకే చెప్పారు. దీంతో రైల్వే అధికారులు సైతం పనులు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. జోన్ పనులు ఈ ఏడాది దసరా, దీపావళి సమయంలో మంచి రోజున ప్రారంభం కానున్నట్టు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

డిపిఆర్ ఆమోద విషయమేంటి ?

విశాఖ కేంద్రంగా వాల్తేరు రైల్వే డివిజన్తో కూడిన దక్షిణ కోస్తా జోన్కు సుమారు రూ.126 కోట్లతో గతంలోనే డిపిఆర్ కేంద్రానికి వెళ్లింది. దీన్ని ఇంతవరకూ ఆమోదించలేదన్నది తెలుస్తోంది. అయితే, రాయగడ డివిజన్ ఏర్పాటు విషయంలో కేంద్రంలోని బిజెపి రాజకీయంగా పావులు కదుపుతూ ఆ డివిజన్ ఏర్పాటుకు 2024 ఆగస్టు 16న రూ.120 కోట్లను విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. దీని ప్రకారం అటు రాయగడ డివిజన్ పనులు, ఇటు విశాఖ కేంద్రంగాగల డిఆర్ఎం ఆఫీసు ఎలాగూ ఉన్నందున జోన్ ఏర్పాట్లు చేయాలని కేంద్ర రైల్వే బోర్డు నుంచి విశాఖ రైల్వేకు సమాచారం వచ్చింది. దీని ప్రకారం తొలుత విశాఖ రైల్వే ఇంజినీరింగ్ అధికారులు ముడసర్లోవలోగల 52 ఎకరాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

సమాజానికి ఆదర్శం ప్రొఫెసర్ ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రెక్టార్, ప్రొఫెసర్ ఎ.ప్రసన్నకుమార్ జీవితం సమాజానికి ఆదర్శమని, ఆదర్శ ఉపాధ్యాయులలో ఆయన అగ్రగణ్యులని దేశ మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు కొనియాడారు. జిల్లా పరిషత్ దరి అంకోసా ఫంక్షన్ హాల్లో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ప్రసన్న కుమార్ 90వ జన్మదినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రసన్న కుమార్ విజ్ఞానం, జ్ఞానం అమూల్యమైనవని అన్నారు. మూడు తరాలు దాటి నాలుగో తరానికి విద్యనందిస్తున్న విద్యావేత్త అని కొనియాడారు. ప్రసన్న కుమార్ విజ్ఞానానికి భాషా పరిజ్ఞానాన్ని జోడించి సేవలందిస్తున్నారని తెలిపారు. ఎయులో విధులు నిర్వహించినప్పుడు పొలిటికల్ సైన్స్లో వేలాది మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న మిజోరం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ విద్యారంగంలో ప్రొఫెసర్ ప్రసన్న కుమార్ చేసిన సేవలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. కార్యక్రమానికి విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షులు డాక్టర్ జి రఘురామారావు అధ్యక్షత వహించారు. నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ వి.బాలమోహన్ దాస్, లీడర్ సంపాదకులు వి.వి.రమణమూర్తి, గండికోట గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశ గతిని మార్చే శక్తి టీచర్లకు మాత్రమే ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ వైఎస్.మూర్తి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఎపి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ టీచర్ అవార్డ్స్ ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ ఛాంపియన్షిప్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో గీతం యూనివర్సిటీ వేదికగా మూడు రోజులపాటు నిర్వహించిన ఎపి స్టేట్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిమకర్ టాటా, డాక్టర్ విజయకుమార్ ఉపాధ్యాయ జెకె.నాయక్, పి.విశ్వనాథ్, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీకృష్ణమూర్తి, విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అడ్వైజర్ షణ్ముఖ, కార్యదర్శి డాక్టర్ డివిఎస్వై.శర్మ పాల్గొని క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, విజేతలకు బహుమతులు అందించారు.

విజేతలు వీరే

అండర్ - 11 బాలుర విభాగంలో తేజ గంగడ తరుణ్, బాలికల విభాగంలో మనస్వి శీలం, అండర్ 13 బాలుర విభాగంలో వేదన్ష్ నాదెళ్ల, బాలికల విభాగంలో షేక్ ఆరిఫ్ సుల్తానా, అండర్ 15 బాలుర విభాగంలో సహస్ర సూర్య విఖ్యాత టేకుమళ్ల, బాలికల విభాగంలో ఎన్ఎవిఎస్ఎస్.రేణుక సత్య విజేతలుగా నిలిచారు.

ఉక్కు కార్మికాగ్రహం

(మొదటి పేజీ తరువాయి..) ఈ పాదయాత్ర ఉత్తేజంగా సాగింది. తొలుత ఈ మహా పాదయాత్రను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. తమ ఉపాధి జోలికొస్తే ఖబడ్దార్ అని పాదయాత్రలో పాల్గొన్నవారంతా హెచ్చరించారు. స్టీల్ప్లాంట్ను రక్షించుకుంటామని పెద్ద పెట్టున నినదించారు. పాదయాత్ర అనంతరం నెల్లిముక్కు వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలతో స్టీల్ప్లాంట్ను కాపాడుకుంటామన్నారు. ప్రభుత్వ, ఉక్కు యాజమాన్య వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం నేరాన్ని కార్మికులపై నెట్టడం దారుణమన్నారు. కాంట్రాక్టు కార్మికులను బలి చేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. స్టీల్ప్లాంట్ నష్టాల్లోకి వెళ్లడానికి ముమ్మాటికీ కేంద్ర బిజెపి సర్కారే కారణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్లాంట్ను రక్షించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ విషయంలో ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం వమ్ము చేయరాదన్నారు. ప్రజాప్రతినిధులు ప్లాంట్ రక్షణకు గళం విప్పాలని కోరారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ప్లాంట్ను పూర్తి సామర్థ్యంతో నడిపించడం చేతకాని యాజమాన్యం కార్మికుల సంఖ్యపైనా, వారి హక్కులపైనా మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. స్టీల్ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, గౌరవాధ్యక్షులు ఒ.వి.రావు మాట్లాడుతూ స్టీల్ కాంట్రాక్ట్ కార్మికులకు పోరాటాలు కొత్త కాదని, పోరాటాలతో సాధించుకున్న హక్కులపై ప్రభుత్వ యాజమాన్యాలు దాడి చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. రానున్న కాలంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యవతి, వి.వి.రమణ, పి.నారాయణరావు, ఆదిరెడ్డి శ్రీను, మసేన్, సోమేశ్, కెపి.సుబ్రహ్మణ్యం, శశిభూషణ్, బొట్టు నరసింహారావు, సూర్యకుమార్, కృష్ణ, వరహాలు, ప్రసాద్ తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

స్టీల్ప్లాంట్ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

సెయిల్లో విలీనం చేయాలి

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్ప్లాంట్ను సెయిల్లో విలీనం చేసి, పూర్తి స్థాయి సామర్థ్యంతో నడిపించాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సిఐటియు విశాఖ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జెఎసి సమావేశంలో జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా జగ్గునాయుడు, జెఎసి నాయకులు మాట్లాడుతూ స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు, దీనిని అభివృద్ధి బాట పట్టిస్తామని కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రకటనలు చేస్తున్నారన్నారు. కానీ ఆచరణ దీనికి పూర్తి విరుద్ధంగా ఉందని తెలిపారు. విశాఖ ఉక్కును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రోజురోజుకూ తీవ్రంగా దెబ్బతీస్తోందన్నారు. సొంత గనులు, రామెటీరియల్, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వకుండా ఉత్పత్తికి ఆటంకాలు సృష్టిస్తోందని, కావాలనే నష్టాల్లోకి నెడుతోందని తెలిపారు. ఉద్యోగులకు, కార్మికులకు జీతాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. పర్మినెంట్ ఉద్యోగుల తగ్గింపు, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపునకు పూనుకుంటోందన్నారు. నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. నానాటికీ ప్రైవేటీకరణ కుట్రలు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర మోడీ ప్రభుత్వ పాలనకు రాష్ట్రంలోని టిడిపి, జనసేన కూటమి ఆక్సిజన్ను అందిస్తూ అత్యంత కీలక స్థానంలో ఉన్నాయన్నారు. స్టీల్ప్లాంట్ పూర్తిగా మునిగిపోక ముందే కూటమి అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తక్షణమే రంగంలోకి దిగి మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు.

1, 2, 3 తేదీల్లో నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

స్టీల్ప్లాంట్ రక్షణకు అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని కోరారు. విశాఖలో జరిగే దీక్షల్లో ఒకటో తేదీన విద్యార్థి, యువజన, దళిత, గిరిజన, సామాజిక సంఘాలు పాల్గొంటాయని, 2వ తేదీ దీక్షల్లో కార్మిక, పెన్షనర్ల సంఘాలు పాల్గొంటాయని, 3వ తేదీ దీక్షల్లో మహిళా, ఇతర ప్రజా సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. 2వ తేదీన నగరంలో వి.వి.రమణమూర్తి సారథ్యంలో నిర్వహించే విశాఖ ఉక్కు రక్షణ ప్రదర్శనకు జెఎసి మద్దతు తెలిపింది. రౌండ్ టేబుల్ సమావేశంలో ఐఎన్టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్, సిఎఫ్టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, టిఎన్టియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి కె.శంకర్రావు, డిహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్, రాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం. సుబ్బన్న, కార్యదర్శి టి.చిరంజీవి, ఐద్వా జిల్లా నాయకులు కె.కుమారి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్జె.నాయుడు, ఉత్తరాంధ్ర బహుజన శక్తి అధ్యక్షులు ఎం.చిరంజీవి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పి.వెంకట రెడ్డి, ఉరుకూటి రాజు, టి.నూకరాజు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి పాల్గొన్నారు.

షిప్ యార్డ్లో డిఫెన్స్ ప్రొడక్షన్ సెక్రటరీ పర్యటన



షిప్యార్డు స్థితిని సంజీవ్ కుమార్కు వివరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డిఫెన్స్ ప్రొడక్షన్ సెక్రటరీ సంజీవ్ కుమార్ ఆదివారం ఉదయం విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్యార్డు లిమిటెడ్ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయడానికి, భవిష్యత్తు ప్రణాళికల కోసం ప్రాజెక్టులు నిర్వహించడానికి అవలంబిస్తున్న ప్రోయాక్టివ్ విధానాన్ని, గోల్ విజన్ వైపు హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. మూలధన వ్యయాన్ని మెరుగుపరచాలని, పరిశోధన, అభివృద్ధిలో పెట్టుబడులు పెట్టాలని, పరిశ్రమ 4.0 టెక్నాలజీ ఉపయోగం పెంచాలని అధికారులకు సూచించారు. మేక్ ఇన్ ఇండియా కింద రాబోయే రక్షణ, వాణిజ్య ప్రాజెక్టులను చురుగ్గా కొనసాగించాలని ఆయన హిందుస్థాన్ షిప్ లిమిటెడ్ బృందానికి సూచించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీనియర్ మేనేజ్మెంట్ బృందానికి స్ఫూర్తిదాయకమైన సూచనలు ఇస్తూ ఉద్యోగులను చైతన్య పరిచారు.

సమస్యలపై వినతి

హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ల పర్యటన నిమిత్తం ఆదివారం విశాఖపట్నం వచ్చిన సంజీవ్ కుమార్కు హెచ్ఎస్ఎల్ లేబర్ అండ్ స్టాఫ్ యూనియన్ (సిఐటియు) నాయకులు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 5 ఎఫ్ఎస్ఎస్ నౌకల నిర్మాణం షిప్యార్డులో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, దేశ రక్షణకు అవసరమైన ఎల్పిడిలు, రీసెర్చ్కి అవసరమైన షిప్పులు, ఇతర డిఫెన్స్ వర్క్ ఆర్డర్స్ను షిప్ యార్డ్కు ఇవ్వాలని కోరారు. 372 మంది ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులను శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాలని, 5 ఎఫ్ఎస్ఎస్ పోర్ట్స్ లీజ్ స్థలం షిప్యార్డ్కు చెందేలా చూడాలని విన్నవించారు. రిటైర్డ్ ఉద్యోగులను సమస్యలను పరిష్కరించాలన్నారు.

కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు జానకిరామ్, ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, కోశాధికారి పి.వి.ప్రసాద్, సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు కె.కుమార్ మంగళం ఉన్నారు.

ముడసర్లోవలో గుర్రపు స్వారీ ప్రాజెక్టు

- ఉన్నత వర్గాలకోసమేనని విమర్శలు
- పర్యావరణానికి ముప్పు కలిగే ప్రమాదం



ముడసర్లోవ పార్కులో హార్స్ రైడింగ్ ప్రాజెక్టు ప్రాంతం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎంతో మందికి ఆహ్లాదం కలిగించే ముడసర్లోవ పార్కును సాధారణ ప్రజలకు దూరం చేస్తున్నారు. పార్కును ఆనుకొని ఒకప్పుడు రోజ్ గార్డెన్ ఉండేది. ఆ స్థలంలో జివిఎంసి గుట్టు చప్పుడు కాకుండా ఉన్నత వర్గాల వారి సరదాల కోసం గుర్రపు స్వారీ శిక్షణ ఇచ్చే ప్రాజెక్టు నిర్మాణాలు చేపడుతోంది. దీనివల్ల పర్యావరణానికి ముప్పు కలిగే ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. ముడసర్లోవ పార్కును ఆనుకొని ఉన్న జివిఎంసి స్థలంలో విశాఖ నగర పాలక సంస్థ రూ.9 కోట్లు వ్యయంతో పిపిపి మోడ్‌లో ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణాలు గత కొన్ని నెలలుగా సాగిస్తోంది. ముడసర్లోవ రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో నిబంధనల ప్రకారం ఎటువంటి కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టకూడదు. అటువంటిది రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న స్థలంలో పచ్చదనాన్ని నాశనం చేసేసి పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపడుతున్నారు. రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో ఇటువంటి నిర్మాణాలు పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందని మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ ఇటీవల ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగి, ఎంతో మందికి ఆహ్లాదం కలిగించే ముడసర్లోవ పార్కు పరిసరాల్లో ఉన్నత వర్గాల ఆనందం కోసం హార్స్ రైడింగ్ ప్రాజెక్టు చేపట్టడాన్ని స్థానికులు, పర్యావరణ వేత్తలు వ్యతిరేకిస్తున్నారు. రిజర్వాయర్‌ను ఆనుకొని ఇటువంటి కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ఇటువంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

శ్రీ బాసరలో టాలెంట్ షో

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక శ్రీ బాసర డిగ్రీ కళాశాల, ఆహా ఓటిటి సంస్థ సంయుక్తాధ్వర్యాన ఆదివారం శ్రీ బాసర డిగ్రీ కళాశాలలో టాలెంట్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆహాతో పాటు టివిఎస్ అపాచీ, పల్సి ఆరెంజ్ సంస్థలు కూడా పాల్గొన్నాయి. ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ పూడి రమేష్‌చాహ రవ్వగా, ప్రిన్సిపల్ సిహెచ్.సురేష్, భాస్కరరావు, శ్రీనివాసరావు, ఎఒ కేశవ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ స్టాల్స్ ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి ఆదివారం ప్రారంభించారు. స్వయం సహాయక సంఘ సభ్యుల ద్వారా వీటిని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో యుసిడి ఎపిడి వై.సంతోష్‌కుమార్, ఆర్‌పిలు, టిడిపి నాయకులు గంటా నూకరాజు, తమ్మిన సూరిబాబు, జనసేన నాయకులు పరిమి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు

ఫుట్‌పాత్ తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి మిథిలాపురి ఉడా కాలనీ రోడ్డులో ఫుట్ పాత్ తొలగింపుపై జివిఎంసి, పోలీసులకు టిడిపి నాయకుడు పిళ్లా వెంకటరావు ఆదివారం ఫిర్యాదు చేశారు. నగరానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు జె.అప్పలరాజు ఉడా రోడ్డులో ప్రభుత్వం నిర్మించిన ఫుట్ పాత్‌ను ఎటువంటి అనుమతి తీసుకోకుండా అప్పలరాజు తొలగించాడని పిళ్లా వెంకటరావు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ సింహాచలం సోమవారం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రామవరంలో కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని రామవరంలో కేంద్ర బృందం పర్యటించి పంచాయతీ రికార్డులు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ పనులను పరిశీలించారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం గురించి ప్రజలు అభిప్రాయాలు, సలహాలను తీసుకున్నారు. మరిన్ని పనులు చేపట్టడానికి అభిప్రాయాలు సేకరించారు. ఉపాధి హామీ పనులు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి.. ఎటువంటి పనులు చేపట్టాలని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ టీమ్ సభ్యులు అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోర్కర్, ఎంపిడిఒ వి.జానకి, ఎపిడి కె.ఆంజనేయులు, డిఆర్‌డిఎ డిపిఎం వైదేహి, సర్పంచ్ ఎర్ర పైడిరాజు పాల్గొన్నారు.

క్రికెట్ అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్రలో క్రికెట్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అధ్యక్షులు కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సానా సతీష్‌బాబు ఆదివారం బిసిసిఐ అధ్యక్ష, కార్యదర్శులు రోజర్ బిన్నీ, జై షాలను కోరారు. బిసిసిఐ ఆహ్వానం మేరకు బెంగళూరులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభోత్సవం, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బిసిసిఐ) నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి దేశంలోని అన్ని రాష్ట్రాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఆంధ్ర నుంచి కేశినేని శివనాథ్, సానా సతీష్‌బాబు హాజరయ్యారు. దేశీయ క్రికెట్ క్రీడా రంగాన్ని బలోపేతం కోసం బిసిసిఐ తీసుకుంటున్న చర్యలను వారు అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో కూడా క్రికెట్ అభివృద్ధికి సహకరించాలని, కొత్త స్టేడియాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బిసిసిఐ అధ్యక్ష, కార్యదర్శులకు విజ్ఞప్తి చేశారు.

సాగర తీరంలో స్వచ్ఛతా హీ సేవా

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి, ఐఎన్ఎస్ విశ్వకర్మ సంయుక్త ఆధ్వర్యాన ఎయు ఉద్యోగుల భాగస్వామ్యంతో ఆదివారం సాగరతీరం, జోడుగుళ్లపాలెంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. జోడుగుళ్లపాలెం సముద్ర తీర ప్రాంతంలో వ్యర్థాలను వెలికి తీశారు. నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానమే లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి సహాయ వైద్యాధికారులు బి.ప్రసాదరావు, డాక్టర్ ఎన్.కిషోర్, ఐఎన్ఎస్ విశ్వకర్మ అధికారులు చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ పాల్గొన్నారు.



సాగర తీరంలో వ్యర్థాలను తొలగిస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు జ్యోతివర్మ



విద్యార్థి జ్యోతి వర్మను అభినందిస్తున్న ఛైర్మన్ కృష్ణారావు

ప్రజాశక్తి -తగరపువలస : హైదరాబాద్‌లో అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి త్రో బాల్ పోటీలకు తమ కళాశాల ఇంటర్ సెకండియర్ ఎంపిసి విద్యార్థి సిహెచ్ జ్యోతివర్మ ఎంపికైనట్లు చిట్టివలస శ్రీ కృష్ణా జూనియర్ కళాశాల ఛైర్మన్ బి.కృష్ణారావు తెలిపారు. విశాఖ ఎవిఎన్ కళాశాల క్రీడా మైదానంలో ఇటీవల జరిగిన 34వ రాష్ట్ర స్థాయి త్రోబాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కూడా ఇతను ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన జ్యోతివర్మను ఛైర్మన్‌తో పాటు పలువురు అధ్యాపకులు అభినందించారు. విద్యార్థి స్వగ్రామం భీమిలి మండలం, చిప్పాడ గ్రామం.

సిఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.25 లక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : విజయవాడ వరద బాధితుల సహాయార్థం వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ రూ.25 లక్షల చెక్కును స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆదివారం అందజేసింది. సహాయం అందించిన వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ ప్రతినిధులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. చెక్కును తొందర్లోనే ముఖ్యమంత్రికి అందజేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్‌నగర్ సొసైటీ ప్రతినిధులు కాయల వెంకటరెడ్డి, ఎంఎస్ఎన్ రాజు, భాస్కర్‌నాయుడు, టిడిపి నాయకులు కోరాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం జాతీయ రహదారిపై ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక మహిళ (50) మృతి చెందింది. స్థానికుల సమాచారంతో గ్రామ విఆర్ఒ మజ్జి శ్రీనివాసరావు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటోందని పోలీసులకు స్థానికులు వివరించారు. కేసును సిఐ చింత వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ పందిరి శివ దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెంలో యువతి అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. జివిఎంసి 7వ వార్డు పరిధి స్వతంత్రనగర్ లక్ష్మీదేవి దేవాలయం సమీపంలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్న డి.పావని ఈ నెల 27వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండి చుట్టుపక్కల, బంధువులు ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లి నాగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం పిహెచ్‌సి వద్ద అక్రమంగా బెల్టు షాపుకు తరలిస్తున్న 10 మద్యం సీసాలను పట్టుకొని చోద్యం గ్రామానికి చెందిన బోళెం సత్యనారాయణ వ్యక్తిపై కేసు నమోదు చేశామని కృష్ణదేవిపేట ఎస్సై దివ్య తెలిపారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా, నిల్వలు ఉన్నట్లలైతే తమకు తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు.

గిరిజన గ్రామంలో గీతం వైద్యశిబిరం

ప్రజాశక్తి -మధురవాడ : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండల పరిధి మారుమూల గిరిజన గ్రామం జామిగూడలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) వైద్యబృందం ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించింది. భారత ప్రభుత్వ శాస్త్రసాంకేతిక విభాగం (డిఎస్‌టి) సీడ్ ప్రాజెక్టులో భాగంగా పాడేరు మండలంలో ఇప్పటికే పలు గ్రామాల్లో ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్న గీతం గిరిజనుల ఆరోగ్యం, పోషకాహార సమస్యలపై కూడా దృష్టి సారించిందని, అందులో భాగంగానే వైద్యశిబిరం నిర్వహించామని ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శరత్‌బాబు తెలిపారు. ఆదివారం జామిగూడ గ్రామంలో జరిగిన వైద్యశిబిరంలో పరిసర గ్రామాల గిరిజనులు పెద్ద ఎత్తున హజరయ్యారు. జిమ్సర్ వైద్యులు డాక్టర్ సందీప్ (జనరల్ మెడిసిన్)తో పాటు స్త్రీ, శిశు వైద్య నిపుణులు డాక్టర్ చందన్, డాక్టర్ షమిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పిల్లలు, స్త్రీలలో పోషకాహార లోపం వల్ల వచ్చే సమస్యలను వైద్యులు వివరించారు. గిరిజన గ్రామ యువతకు సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఉపాధి శిక్షణ అందించనున్నట్లు శరత్‌బాబు తెలిపారు. గిరిజన ప్రాంతంలో వైద్యసేవలు అందించడం పట్ల గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ, జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి వైద్యబృందాన్ని అభినందించారు.

చెన్నా కన్వెన్షన్ సెంటర్‌కు అవార్డు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం చెన్నా కన్వెన్షన్ సెంటర్ హాలు ఏపీ బెస్ట్ స్టాండ్ కన్వెన్షన్ సెంటర్‌గా గుర్తింపు పొందింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం -2024 వేడుకల్లో ఏపీ టూరిజం మినిస్టర్ కందుల దుర్గేష్ ద్వారా కన్వెన్షన్ సెంటర్ అధినేత చెన్నా వెంకటేష్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా చెన్నా కన్వెన్షన్ హాల్ అధినేత చెన్నా వెంకటేష్ మాట్లాడుతూ ఏపీ బెస్ట్ స్టాండర్డ్ కన్వెన్షన్ హాల్‌గా గుర్తింపు రావడం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రోత్సాహంతోనే సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్‌కు ప్రముఖ వ్యాపారస్తులు, గ్రామస్తులు, మిత్రులు అభినందనలు తెలిపారు



అవార్డు అందుకుంటున్న చెన్నా వెంకటేష్



ఆందోళన చేస్తున్న స్థానిక మహిళలు

షీలానగర్‌లో స్థలం కబ్జాపై ఆందోళన

ప్రజాశక్తి -గాజువాక : షీలానగర్‌లో ప్రభుత్వ స్థలం కబ్జా పట్ల స్థానికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, 1981లో బిహెచ్‌పివి హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా 328 వ్యక్తిగత స్థలాల కేటాయింపు జరిగిందన్నారు. ఆ సమయంలో పార్కులు, సామాజిక భవనాలు, ఇతర అవసరాల కోసం కొంత స్థలం కేటాయించినట్లు తెలిపారు. 1997 సంవత్సరంలో మున్సిపాలిటీకి వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం కొంత స్థలాన్ని కేటాయించారని, ఆ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు విక్రయించారని, ట్యాంక్ నిర్మాణం కోసం ఉచిత స్థలం అమ్మకం జరిగితే, భవిష్యత్తులో మరో ట్యాంక్ నిర్మాణం కోసం స్థలం లేదని, తక్షణమే ఆ స్థలాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఉడా అధికారులు స్పందించి స్థలాన్ని కాపాడాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి స్థలం వద్దకు వచ్చి ఆందోళనకు మద్దతు తెలియజేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో స్థానికులు జి.మణి, ఐ.గాంధీ, జి.సుబ్బరాజు, సత్యారావు, ఎం.వెంకటేశ్వరరావు, శరత్, కృష్ణారావు పాల్గొన్నారు.

ఇనార్బిట్‌మాల్ నిర్మాణంలో తరుచూ ప్రమాదాలు?

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు ఆసుపత్రి సమీపం సాలిగ్రాంపురంలో నిర్మాణంలో ఉన్న ఇనార్బిట్ మాల్‌లో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం గిరిప్రదక్షిణ రోడ్డు వైపు సెంట్రింగ్ పనులు చేస్తుండగా హఠాత్తుగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో సెంట్రింగ్ కింద ఎంత మంది కూలీలు ఉన్నారో తెలియడం లేదు. ప్రమాదం అనంతరం గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారని కాలనీవాసులు చెబుతున్నారు. ఈ ప్రమాదాన్ని కప్పిపుచ్చేందుకు ఇనార్బిట్ మాల్ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ నిర్మాణం పనుల్లో ముగ్గురు కార్మికులు మరణించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. విషయం బయటకు రానీయకుండా యాజమాన్యం చేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

రామచంద్రనగర్ డంపింగ్ యార్డును తరలించాలి

ప్రజాశక్తి -గాజువాక : రామచంద్రనగర్ డంపింగ్ యార్డును తరలించాలని స్వతంత్రనగర్ సిపిఎం శాఖ మహాసభలో సభ్యులు తీర్మానం చేశారు. మహాసభలో ప్రధానంగా రామచంద్రనగర్ డంపింగ్ యార్డు తరలింపుతోపాటు గంగవరం పోర్టు కాలుష్యం, లోతట్టు ప్రాంతాలకు పట్టాలు జారీ చేయాలని భవిష్యత్తులో పోరాటాలు చేయాలని తీర్మానం చేశారు. ఈ తీర్మానాలను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. భవన నిర్మాణ కార్మికులకు ఇసుక అందక పనులు లేకపోవడంతో ఒకటవ తేదీన గాంధీనగర్ సచివాలయం వద్ద ధర్నా చేయాలని నిర్ణయించారు. మహాసభలో కార్యదర్శిగా బి.రమణను ఎన్నుకున్నారు.

డిసెంబర్ 1న వైజాగ్ మారథాన్

ప్రజాశక్తి- సీతమ్మధార : బీచ్ రోడ్డులో డిసెంబర్ 1వ తేదీన వైజాగ్ మారథాన్ నిర్వహించనున్నట్లు అలివ్ గ్రీన్ స్పోర్ట్స్ కమిటీ సభ్యులు వై.శ్రీనివాసరావు, బికె.రాయ్ తెలిపారు. ఈ మేరకు సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో వైజాగ్ మారథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో ఆరోగ్యం, క్రీడలు ప్రాముఖ్యతను వివరించారు. వైజాగ్ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. వైజాగ్ బీచ్ నిర్వహించే ఈ మారథాన్‌ను విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశంలో తిరుపతిరాజు, డాక్టర్ మృదుల తదితరులు పాల్గొన్నారు.

రూ.15.97 కోట్లతో ఉపాధి పనులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గంలో ఉన్న భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో రూ.15.97 కోట్లతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకం కింద పలు పనులు చేపట్టనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. భీమిలి మండలంలో రూ.5.88 కోట్లు, ఆనందపురం మండలంలో రూ.5.77 కోట్లు, పద్మనాభం మండలంలో రూ.4.32 కోట్లతో సిసి రోడ్లు, కాల్వలు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నాయి.

ఉచిత ఇసుక విధానం అమలుకు ధర్నా

ప్రజాశక్తి-పెందుర్తి : ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలుచేయాలని డిమాండ్‌చేస్తూ 97వ వార్డు పరిధి చిన ముసిడివాడలో సిఐటియు ఆధ్వర్యాన ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో కూడా ఇసుక ఇవ్వకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినా ఇసుకను అందుబాటులో తేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప భవన నిర్మాణ కార్మికులు కష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ, గతంలో భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులు ఉండటం వల్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్ అయ్యేదని తెలిపారు. ఇప్పుడు అసలు లాభం డిపార్ట్‌మెంట్ ఉందా.. లేదా.. అనే అనుమానం కలుగుతుందని అన్నారు. ఇలాగే కొనసాగితే వారం రోజుల్లో కార్మికులందరూ రోడ్డెక్కి భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలనాయుడు, ఈశ్వరరావు, ప్రభుదేవా, మహేష్ రాజు, పూర్ణ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి, అధిక సంఖ్యలో భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

బంటాకాలనీ వాసులకు నష్టపరిహారమివ్వాలి



నిరసన తెలుపుతున్న బంటాకాలనీ వాసులు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి బంటా కాలనీ వాసులకు ఎల్‌జి పాలిమర్స్ నష్టపరిహారం ఇవ్వాలని ఆదివారం కాలనీవాసులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్ తమ కాలనీకి సుమారు కిలోమీటర్ దూరం కన్నా తక్కువ ఉందని తెలిపారు. రెండు కిలోమీటర్ల దూరం ఉన్న కాలనీవాసులకు నష్ట పరిహారం ఇచ్చారని, తమకు మాత్రం ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలోని నాయకుల తప్పిదాలు వల్ల కాలనీవాసులు ఎంతో నష్టపోయారని తెలిపారు. 2020లో సంఘటన జరిగినప్పుడు ప్రాణ భయంతో అందరమూ పరుగులు తీశామని, చాలామంది అస్వస్థకు గురయ్యారని వివరించారు. తమ సమస్యను అప్పటి జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్ళామని తెలిపారు. ఇప్పుడు చర్మవ్యాధులు, శ్వాస సంబంధిత వ్యాధులతో చాలామంది బాధపడుతున్నారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లాలని కోరారు. నష్ట పరిహారం చెల్లించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంటాకాలనీ గ్రామ సంఘం ప్రెసిడెంట్ ఎస్.అప్పలరాజు, సెక్రటరీ సాయి, జాయింట్ సెక్రటరీ ఆనంద్, క్యాషియర్ వినోద్, అధ్యక్షులు చినబాబు, సలహాదారులు ఈశ్వరరావు, కమిటీ మెంబర్లు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జియ్యాని

గుడివాడకు జియ్యాని శుభాకాంక్షలు

ప్రజాశక్తి-వేపగుంట : వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, అమర్‌నాథ్ గతంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఆయన నాయకత్వంలో అందరమూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయటానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

మా సభ్యుల జోలికొస్తే సహించం

ప్రజాశక్తి-గాజువాక : తమ సంఘ సభ్యుల జోలికొస్తే సహించేది లేదని ఉత్తరాంధ్ర ట్రైలర్, ట్రక్ ఓనర్స్ అండ్ సప్లయర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జ్యోతిరెడ్డి హెచ్చరించారు. గాజువాకలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం జరిగిన సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైజాగ్ లారీ అసోసియేషన్ సభ్యులు తమ అసోసియేషన్‌లో ఉన్న వారిని రోడ్డుమీద తిరగకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం గంగవరం పోర్టు రోడ్డులో ట్రైలర్స్ తిరగకుండా అడ్డుకున్నారని, దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని చెప్పారు. బయటి వ్యక్తులు విశాఖలో వ్యాపారం చేయరాదని చెప్పడం సరికాదన్నారు. హిందీ వారు వైజాగ్‌లో వ్యాపారం చేయరాదని చెప్పడానికి ఆ సంఘం సభ్యులు ఎవరని ప్రశ్నించారు. తమ సంఘం ఆధ్వర్యాన సుమారు 3వేల మంది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. తమ సంఘ సభ్యుల పట్ల బెదిరింపులకు పాల్పడితే పోలీసులను ఆశ్రయించి న్యాయబద్ధంగా బుద్ధి చెబుతామని పేర్కొన్నారు. గౌరవాధ్యక్షులు సాయిరెడ్డి మాట్లాడుతూ, వాహనాలను ఆపితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జానకిరామిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఐ.రాజా, వైస్ ప్రెసిడెంట్ పిజెఆర్‌ఎస్.మహరధి, ట్రెజరర్ మిశ్రా ఫైవహన్, అరవింద్ మిశ్రా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.భాస్కరరావు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతిరెడ్డి

ఘనంగా గణిత విజ్ఞాన మేళా

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యాభారతి ఆధ్వర్యాన స్థానిక శ్రీకృష్ణ విద్య మందిర్‌లో రాష్ట్రస్థాయి గణిత విజ్ఞాన మేళా సంస్కృతి మహోత్సవాన్ని ఎన్ఎస్‌టిఎల్ శాస్త్రవేత్త వై.వీరాచారి ప్రారంభించారు. రాష్ట్రంలో విద్యా భారతికి అనుబంధంగా ఉన్న పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొని వేద గణితం, సైన్స్ సాంస్కృతికాలకు సంబంధించిన కొన్ని అంశాల్లో నమూనాలు ప్రదర్శించారు. క్విజ్, ప్రయోగాత్మక పోటీలు, నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాచారి మాట్లాడుతూ భారతీయ శాస్త్రవేత్తలు ప్రపంచానికి అందించిన ఆవిష్కరణలు అద్భుతమైనవన్నారు. శాస్త్ర పరిశోధన రంగంలో విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యా భారతి రాష్ట్ర కార్యదర్శి కన్నా భాస్కర్ సహాయ కార్యదర్శి కెవి.ఆనంద్ మాట్లాడుతూ, సమాజాభివృద్ధిలో ప్రాథమిక విజ్ఞాన శాస్త్రానికి, సమాజానికి ఉన్న విజ్ఞానాన్ని తెలియజేయడానికి ఏటా విజ్ఞాన మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రుషికొండ బీచ్‌లో యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డు

ప్రజాశక్తి - ఆరిలోవ : రుషికొండ బీచ్‌లో మునిగిపోతున్న యువకుడిని జివిఎంసి లైఫ్ గార్డు రక్షించినట్లు అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి ఆదివారం తెలిపారు. నగరంలోని మధురవాడకు చెందిన ఐదుగురు స్నేహితులు ఆదివారం రుషికొండ బీచ్‌లో సరదాగా గడిపేందుకు వచ్చారని, వారిలో మధురవాడకు చెందిన కె.హేమంత్ (23) రిప్ కరెంట్‌లో పడి బీచ్‌లో మునిగిపోతుండగా జివిఎంసి లైఫ్ గార్డు టి.సతీష్ గమనించి, రక్షించి బయటకు తీసుకొచ్చాడని అదనపు కమిషనర్ తెలిపారు. విశాఖ నగరానికి విచ్చేస్తున్న సందర్శకులు, పర్యాటకులు, విహార యాత్రికులు, నగర ప్రజలు విశాఖ సముద్రతీరాలను, అందాలను తిలకిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించాలి తప్ప సముద్రంలో స్నానాలకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని కోరారు. సముద్ర తీరాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినప్పటికీ సందర్శకులు బీచ్‌లో స్నానానికి దిగి లోతట్టు ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీచ్‌లో స్నానాలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

పీలా గోవిందకు అభినందన



కశింకోటలో పీలాగోవిందను అభినందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి- కశింకోట : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫర్మేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణను ఆదివారం కశింకోట మండలం టిడిపి నాయకులు కలిసి పూలమాలలతో సత్కరించారు. మండల మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, కాయలు మురళి, సిదిరెడ్డి శ్రీను, కాండ్రేగులు సతీష్, తాకాసి కృష్ణ ఉన్నారు.

అనకాపల్లి: పట్టణ జనసేన కార్యాలయంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పీలా గోవింద సత్యనారాయణను జనసేన నియోజకవర్గ ఇంఛార్జి భీమరశెట్టి రాంకీ ఆధ్వర్యంలో అభినందించి,శుభాకాంక్షలు తెలిపారు. మళ్ల సురేంద్ర, పచ్చి కూర రాము, తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి బాబి, కొణతాల నూకు నాయుడు, మద్ది దొర పాల్గొన్నారు.

వికలాంగులకు ఉపకరణాల అందజేత



ట్రైసైకిల్, వీల్ చైర్ అందజేస్తున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని ఉడ్‌పేటలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం బుచ్చయ్యపేట మండలం పెద మదినకు చెందిన కేశంశెట్టి ఈశ్వరరావుకు ట్రైసైకిల్, బయ్యవరానికి చెందిన కలగా రాములమ్మకు వీల్‌చైర్‌ను అందజేశారు. గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ జగదీష్, పార్థు వాటర్ సర్వీసింగ్ సెంటర్ ప్రొప్రైటర్ నామ చంద్రశేఖర్, నేషనల్ బాడీ బిల్డర్ సహకారంతో సమకూర్చిన వీటిని ఉత్తమ ఉపాధ్యాయులు వికలాంగ ఉద్యోగుల అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కొర్రుప్రోలు వెంకటేశ్వరరావు మాస్టారు అందజేశారు.కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, చెట్టుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైవాడ నీటి విడుదల



రెండు గేట్లు ఎత్తి విడుదల చేస్తున్న రైవాడ రిజర్వాయర్ నీరు

ప్రజాశక్తి- దేవరాపల్లి : రైవాడ జలాశయం నుంచి శనివారం రాత్రి రెండు గేట్లు ద్వారా 2500 క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడిచిపెట్టినట్లు జలాశయ డిఇఇ సత్యంనాయుడు తెలిపారు. జలాశయం అత్యధిక నీటిమట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలాశయ నీటిమట్టం113,.85 మీటర్లుకు చేరింది. ప్రస్తుతం క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి జలాశయంలోకి 2500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో, రెండు గేట్లు ద్వారా అంతేమొత్తం నీటిని కిందికి విడుదల చేయడం జరిగిందని జలాశయ డిఇఇ సత్యంనాయుడు తెలిపారు. శారదా నది పరివాహక ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సాహసాలు చేసి నదిలో దిగవద్దని సూచించారు. దీనిపై అన్ని పంచాయతీ పంచాయతీల్లో దండోరాలు వేసి ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులు కోరారు

నేడు కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్స్‌డేను

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న దయామణి

ప్రజాశక్తి-.అనకాపల్లి : రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాలు, పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని ఈనెల 30న నిర్వహించనున్న డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని ఎపి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కె. దయామణి పిలుపునిచ్చారు. ఆదివారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో వివిధ విభాగాల కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా దయామణి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తారు. విద్య, వైద్యం, మున్సిపల్, ఆర్డబ్ల్యుఎస్ ఇతర శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో వీరి సమస్యలను ఒక అజెండాగా తీసుకుని 30న డిమాండ్స్ డే నిరసన చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ ఉద్యోగుల నాయకులు పెంటయ్య, తులసి, సింహాచలం, సూరి అప్పారావు పాల్గొన్నారు.

పలుచోట్ల భగత్‌సింగ్‌కు ఘననివాళి





పరవాడ, మునగపాకలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సిఐటియు, ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని లంకెలపాలెం బిసి బాలుర హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించారని, భగత్ సింగ్ పేరు వింటే చైతన్యం, భగత్ సింగ్ కదిలించే, నడిపించే ఓ స్ఫూర్తి అని కొనియాడారు. చిరుప్రాయంలోనే దేశం కోసం ఉరికొయ్యను ముద్దాడిన విప్లవదీరుడని, ఆయన ఆశయ సాధన కోసం ప్రజలు పనిచేయాలని పిలుపునిచ్చారు. అందరికీ విద్య, ఉపాధి, వైద్యం వంటి మౌలిక వసతుల కోసం ప్రభుత్వాలపై భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డి ఉదయ్, వై గోవిందరావు, ప్రసాద్, సంతోష్, సూర్య, రమణ, తేజ పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని వెంకటాపురం గ్రామంలో భగత్‌సింగ్ 117వ జయంతి సందర్భంగా శనివారం రాత్రి సిఐటియు నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, చిన్ని కిషోర్, దళాయి రాంబాబు, ఎస్ కృష్ణ, ఎస్ నాయుడు, సిహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక





కశింకోట, యలమంచిలిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని నర్సింగబిల్లి హైస్కూల్ 2011-12 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది,పూర్వ జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమం సురేష్, రమణ, అప్పారావు పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలి గరల్స్ హైస్కూల్ 1982 – 83 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం అదే స్కూల్లో నిర్వహించారు. 42ఏళ్ల తర్వాత కలుసుకున్న వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. ఆ బ్యాచ్‌లో 70 మంది విద్యార్థినుల్లో 38 మంది ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడి సేవలందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో పలు కీలక పదవుల్లో ఉన్న వారంతా ఈ ఆత్మీయ కలయికలో తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు సావిత్రి, సరోజని, అరుణకుమారి, లక్ష్మీకాంతం లను ఘనంగా సత్కరించారు. యలమంచిలి డివిజనల్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన మంజులా వాణి పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి.-అనకాపల్లి :ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సిఫార్సులతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు ఆదివారం అందజేశారు. 81వ వార్డు సాగి సుబ్బరాజువీధికి చెందిన ఆడారి ధనలక్ష్మి కుటుంబ సభ్యులకు రూ.4.50లక్షల సిఎం సహాయనిధి సాయాన్ని అందజేశారు. టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర గవర కన్వీనర్ మళ్ల సురేంద్ర, పచ్చి కూర రాము, తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి బాబి, కొణతాల నూకు నాయుడు, మద్ది దొర పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ దీక్షలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపులో భాగంగా వచ్చేనెల ఒకటి నుంచి 3 వరకు నిర్వహించే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 1న విద్యార్థి యువజన సంఘాలు, 2న కార్మిక సంఘాలు, 3న రైతు మహిళా వ్యవసాయ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు జరుగుతాయన్నారు. అనకాపల్లి నాలుగు రోడ్ల కూడలి బస్‌స్టాప్ వద్ద జరుగు నిరాహారదీక్ష శిబిరానికి నల్లబ్యాడ్జీలతో రావాలన్నారు.

రేపు సీతారాం ఏచూరి సంతాపసభ

ప్రజాశక్తి-అనకాపల్లి : సీతారాం ఏచూరి సంతాపసభను వచ్చేనెల ఒకటిన మంగళవారం ఉదయం అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న విజయ రెసిడెన్సిలో నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి గంట శ్రీరామ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సభకు స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి, దాడి వీరభద్రరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సిపిఎంజిల్లా కార్యదర్శి కె.లోకనాధం, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల సుబ్బన్న, అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంజెవిఎన్ కుమార్, పిఎస్ అజయ్‌కుమార్, జి. కోటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. సంతాప సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తాతయ్యబాబుకు శుభాకాంక్షలు



తాతయ్యబాబును అభినందిస్తున్న తెలుగు మహిళలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబును తెలుగు మహిళ జిల్లా నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, నర్సీపట్నం జడ్పిటిసి ఎస్. రమణమ్మ, మాజీ ఎంపిపి పోతల రమణమ్మ అమర పిన్ని వరలక్ష్మి ఉన్నారు.

చోడవరం : రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా నియమకమైన బత్తుల తాతయ్యబాబును జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో జనసేన నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అలం అప్పారావు పట్టణ మహిళా అధ్యక్షురాలు నర్వ సరోజ , గూడూరు ములు నాయుడు తెలకపల్లి మహేష్, చెప్పకట్ల శ్రీను, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరుకు కృషి

వడ్డాది : రాష్ట్రంలో అర్హత కలిగినజర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలతోపాటు ఇళ్లమంజూరుకు కృషి చేస్తానని రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్, అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు హామీ ఇచ్చారు. ఆదివారం ఎపియుడబ్ల్యుజె అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తాతయ్య బాబును మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పెంటకోట జోగినాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దాల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు, రాష్ట్ర కమిటీ నాయకులు సిహెచ్ఎల్‌పి స్వామి, మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్ష ,కార్యదర్శులు రామారావు, సత్యనారాయణ సభ్యులు సంయుక్తంగా కలిసి పాత్రికేయులకు ఇల్లు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న జర్నలిస్టుల పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్నారని, ఇపుడు అదే నిర్ణయంతో ఉన్నారన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, గృహ నిర్మాణ శాఖామంత్రి దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేస్తానని హామీనిచ్చారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు జర్నలిస్టులకు మద్దతు పలికారు.కౌన్సిల్ సభ్యులు రామకోటి ,ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జగదీష్ ఉన్నారు.

చెరుకు రైతుల ఆశలపై నీళ్లు!

సుగర్స్ మహాజన సభపై అన్నదాతల పెదవి విరుపు : సిపిఎం నేత వెంకన్న

ప్రజాశక్తి -చోడవరం : చెరకు రైతుల ఆశలను నీరుగార్చేలా గోవాడ సుగర్స్ రైతుమహాజన సభ జరిగిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న విమర్శించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటన విడుదల చేసారు. 28న గోవాడ సుగర్స్‌లో ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ విఎస్ నాయుడు ఆధ్వర్యంలో చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సభ్య రైతులతో నిర్వహించిన మహాజనసభలో ఫ్యాక్టరీ పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు.

2010 నుంచి ఫ్యాక్టరీలో చోటుచేసుకున్న అవకతవకలపై సిబిఐ విచారణ జరిపించాలన్న డిమాండ్‌పై ఎటువంటి స్పందన లేదన్నారు. చెరకు మద్దతు ధర టన్నుకు రూ.3151లుగా కేంద్రం నిర్ణయించిందని కలెక్టర్ వెల్లడించారని, అది ఏటూ సరిపోదన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు చెరకు టన్నుకు రూ.నాలుగు వేలు ఇస్తామని హామీఇచ్చారని, అది గాల్లో కలిసిపోయినట్టేనా అని మండిపడ్డారు. రైతుల చెరుకు బకాయిలు, కార్మికుల వేతన బకాయిలు, గ్రాట్యుటీ, పిఎఫ్ బకాయిలుపై స్పష్టత ఇవ్వక పోవడం దుర్మార్గమన్నారు రైతులకు ఉచితంగా చెరుకు విత్తనం, ఎరువులు ఇప్పించి ప్రోత్సహిస్తేనే ఫ్యాక్టరీ మనుగడ ఉంటుందని, ఆ దిశలో ఎటువంటి ప్రకటన చేయలేదన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఫ్యాక్టరీకి రూ.89 కోట్ల నిధులు ఇచినప్పటికీ, ఇప్పటివరకు చెరకు రైతులకు చెల్లించాల్సిన బ్యాలెన్స్ బకాయిలు టన్నుకు రూ.419.75 ఊసే లేదన్నారు. చెరకు రైతులకు మద్దతు ధర రూ 3151 ప్రకటించినందున దానికి ప్రభుత్వ సహకారంగా మరో రూ.900 వచ్చేటట్లు చేయాలని డిమాండ్ చేసారు. ఉద్యోగ విరమణ చేసిన సుగర్స్ కార్మికులకు గ్యాట్యూటీ, పిఎఫ్‌బకాయిలు చెల్లించాలని, ఫ్యాక్టరీని పరిరక్షించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన



అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన

ప్రజాశక్తి-కె.కోటపాడు: అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లాస్థాయిలో ఉత్తమ టీచర్లుగా అవార్డులు అందుకోవడం గర్వంగా ఉందని విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాసిం అన్నారు. పాఠశాలకు చెందిన బి.సుమతి, సీమునురు రమణ, మాడిస జ్యోతి ఎపి ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయగా, ఆదివారం విశాఖపట్నంలోని డాక్టరు వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో భీమిలి ఎమ్మెల్యే, విద్యాశాఖ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, నన్నయ్యవర్సిటీ విశ్రాంత విసి ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు, అర్‌జెడి.విజయభాస్కర్, రాజీవ్ విద్యా మిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు, ఇతర ప్రముఖులు నుంచి అవార్డు స్వీకరణ, సత్కారం పొందారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ డాక్టరు ఖాశీం, డైరెక్టర్ నూర్జహాన్, ఉపాధ్యాయ సిబ్బంది అవార్డుల గ్రహీతలను అభినందించారు.

విద్య, వైద్యాన్ని ప్రయివేటుపరం చేయొద్దు

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న శివారెడ్డి

ప్రజాశక్తి-.అనకాపల్లి : విద్య,వైద్యాన్ని ప్రయివేటుపరం చేయొద్దని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి. జాన్సన్ బాబు, కే.శివారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో యూనియన్ ప్రథమ జిల్లా మహాసభ రెండవ రోజున జిల్లా అధ్యక్షులు బి.బాబ్జి అధ్యక్షతన ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలను ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు హాస్టల్ సమస్యలపై జూన్ నెల నుంచి పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేస్తుంటే స్థానిక నేతలు, రాష్ట్ర ప్రభుత్వం కళ్లప్పగించి చూడడం రాష్ట్ర ప్రజలు, యువతను మోసం చేయడమేనన్నారు. అనకాపల్లి ప్రథమ మహాసభ బహిరంగ సభ వేదికగా ఉద్యోగం, ఉపాధికి విద్యార్థులందరూ పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : మారుమూల గ్రామాల గిరిజనులకు ఆదివారం సత్యసాయి ట్రస్ట్ తరపున నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఇటీవల వర్షాలతో అవస్థలు పడుతున్న అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ మాకనాపల్లి గ్రామానికి చెందిన 27 గిరిజన కుటుంబాలకు గిరిజనులకు వెంపల్‌నగర్ గల్లా శంకరరావు ఆధ్వర్యంలో బియ్యంతోపాటు నెలకు సరిపడా నిత్యవసర వస్తువులను అందజేశారు సంస్థ సభ్యులు రంకి రెడ్డి వెంకటేశ్వర్లు, వేతనపు రామానాయుడు, లెక్కల సత్యనారాయణ, వేచలపు వెంకటరమణమూర్తి, సుర రామారావు పాల్గొన్నారు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ గొల్లగుంట గ్రామంలో ఆదివారం పారిశుధ్య పనులు ముమ్మరంగా జరిగాయి. వీధి రోడ్లను శుభ్రం చేశారు. మురికి నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లారు. పారిశుధ్య కార్మికుల కొరతతో ఇద్దరితోనే పనులు చేయించారు. ఆదివారం సెలవు రోజున పనిచేసిన కార్మికులకు రెట్టింపు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆహార పంటల నష్ట నివారణ చర్యలు చేపట్టాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లి : రైతులు ఆహార పంటల నష్ట నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ ముకుందరావు అన్నారు. ఆర్ఏఆర్ఎస్ పంటకోత అనంతర సాంకేతిక పరిజ్ఞానం భాగం ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ ఆహార పంటల నష్ట నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముకుందరావు మాట్లాడుతూ దేశంలో పంటకోత అనంతరం వివిధ ప్రక్రియలో 10 నుంచి 25శాతం పంట నష్టం జరుగుతుందన్నారు. దీని విలువ సుమారు రూ.92 వేల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారన్నారు. పంటకోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన విభాగాధిపతి డాక్టర్ పివికె.జగన్నాథరావు పంట కోత అనంతరం నష్ట నివారణ చర్యలు, విలువ ఆధారిత ఉత్పత్తులపై వివరించారు. నర్సీపట్నం డివిజన్ ఫుడ్ ఇన్స్పెక్టర్ రవికుమార్ ఆహార పరిరక్షణ ప్రమాణాల చట్టం, నాణ్యత ప్రమాణాల చట్టం, ఆహార ప్యాకేజింగ్ అంశాలు, ఆహార భద్రత ప్రమాణాలు వివరించారు. అనంతరం ఆహార పంటల నష్ట నివారణ చర్యలు కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రమణమూర్తి, కొండెంపూడి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్, చెరుకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి, ఇంజనీర్ కుసుమ, శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు, బిసిటీ సంస్థ నుంచి సుధా, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ మండలాల నుంచి వచ్చిన గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుతో ఆదాయం బాగు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఉద్యానవన అధికారి ప్రభాకర్

ప్రజాశక్తి- సబ్బవరం : ఉద్యానవన పంటల సాగుతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునని జిల్లా ఉద్యానశాఖ అధికారి జి ప్రభాకరరావు అన్నారు. ఉద్యానవన పంటల సాగుకు ఆసక్తిగల రైతులకు ప్రభుత్వం రాయతీలను కల్పిస్తోందని తెలిపారు. ఆదివారం మండలంలో అమృతఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఏడవ వార్షికోత్సవాన్ని సంఘం చైర్మన్ పొట్నూరి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని 41 గ్రామాల్లో సుమారు 1050 మంది రైతులు అమృతఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లో సభ్యులుగా ఉన్నారన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు పండించిన పంటలను ఉత్పత్తిదారుల సంఘానికి విక్రయించడం ద్వారా మద్దతు ధరను పొందవచ్చునన్నారు.

రైతులు సంఘంగా ఏర్పడి వ్యవసాయాన్ని చేస్తే ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహాన్ని అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు గురించి వివరించారు. అమృతఫల వార్షిక నివేదికను సిఇఒ కెఎల్ఎన్ మౌక్తిక చదివి వినిపించారు. కార్యక్రమంలో జాగృతి మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత ఉద్యానవన శాఖధికారి కిరణ్మయి, అగ్రికన్సల్టెంట్ వి .రెడ్డి నాయుడు, అమతఫల ఎఫ్‌పిసి బోర్డు డైరెక్టర్స్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

15 రోజులుగా పనిచేయని ఎటిఎం

పట్టించుకోని బ్యాంక్ అధికారులు



తోటాడలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటిఎం

ప్రజాశక్తి- మునగపాక :మండలంలోని తోటాడ గ్రామంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటిఎం గత 15 రోజులుగా పనిచేయడం లేదు. రోజువారీ ఆర్థిక కార్యకలాపాల కోసం లావాదేవీలు చేసుకోవటానికి అనువుగా ఉండే ఏటీఎం పని చేయకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. అయినా బ్యాంకు మేనేజర్‌గాని, అధికారులుగాని ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్‌ను పలువురు ప్రశ్నించినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు కసురుకుంటున్నారని వినియోగదారులు వాపోతున్నారు. తక్షణమే ఏటీఎంను పనిచేసే విధంగా బ్యాంకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కాండ్రేగుల రాము, ఆళ్ళ మహేశ్వరరావు తదితరులు విజ్ఞప్తి చేశారు.

గుండె జబ్బులపై జాగ్రత్తలు అవసరం



డాక్టర్ నాయుడును సత్కరిస్తున్న వాకర్స్

ప్రజాశక్తి-.అనకాపల్లి: గుండె జబ్బులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు, సీనియర్ వాకర్, జిల్లా -101 పూర్వ ఎవిపి డాక్టర్ డిడి.నాయుడు అన్నారు. ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అనకాపల్లి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ సహకారంతో లాంగ్ వాక్ నిర్వహించారు. వాకర్ అధ్యక్షులు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి సాంబశివరావు, కోశాధికారి రాపేటి నారాయణ రావు సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ వాకర్, జిల్లా -101 పూర్వ ఎవిపి డాక్టర్ డిడి.నాయుడు పాల్గొని హృద్రోగం ఎలా వస్తుంది, తీసుకోవలసిన జాగ్రతలను వివరించారు. మద్యం, పొగతాగడం, ఒత్తిడితోపాటు సరైన వ్యాయామం చేయకపోవడం వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఊబకాయం రాకుండా ప్రతిఒక్కరూ చూసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ నాయుడును వాకర్స్ క్లబ్ సభ్యులు మూమెంటో, కండువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ వాకర్స్ జి కృష్ణమూర్తి, బి.వి రమణ, నల్లల దేవుళ్ళు, డాక్టర్ కె వీరభద్రరావు, వై సత్యనారాయణ, కె పూర్ణ చంద్రరావు, ఆడారి మల్లికార్జున రావు, ఆడారి రామకృష్ణ, బి శేషు, బుద్ధ అప్పారావు, ఎంటి రామారావు పాల్గొన్నారు.

వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

ప్రజాశక్తి- చోడవరం : ఎస్‌సి వర్గీకరణతో రాజ్యాంగ స్ఫూర్తికే విఘాతం కలుగుతుందని మాజీ ఎంపి జివి. హర్షకుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో వర్గీకరణకు వ్యతిరేకంగా అంబేద్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో మాలల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ భవన్లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లు పూర్తిగా ఎత్తివేయడానికి కుట్రలో భాగంగా వర్గీకరణలు తీసుకొచ్చి బడుగు బలహీన వర్గాల మధ్య చిచ్చు పెట్టడానికి చూస్తుందన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికే విఘాతం కలిగేలా రిజర్వేషన్ అనేది లేకుండా చేయడానికి పూనుకుంటున్నారు. ఇటువంటి చర్యను మాలలు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మంచం మల్లేశ్వరి, మల్లెల వెంకట్రావు ,వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బధిరులకు ఎంవిఆర్ ట్రస్ట్ సాయం



బస్సులను ప్రారంభిస్తున్న సతీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : బదిరుల ఆత్మీయ సమావేశానికి ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త సంఘ సేవకులు ముత్యాల వెంకటేశ్వరరావు సహాయం చేశారు. ఆదివారం పట్టణంలోని నరసింహరావుపేటలోని ట్రస్ట్ కార్యాలయం నుంచి బదిరుల ఆత్మీయ సమావేశానికి వెళ్లేందుకు రెండు బస్సులను సమకూర్చి, వాటిని ఎంవిఆర్ తనయుడు సతీష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో చెకుముకి పరీక్ష

ప్రజాశక్తి-రాంబిల్లి: మండలంలోని కొండలి దేవుడిపాలెంకస్తూరి గాంధీ బాలిక విద్యాలయంలో పాఠశాల స్థాయి చెకుముకి పోటీ పరీక్షలు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించారుప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

జగనన్న కాలనీలో సమస్యల కొలువు

-తాగునీటి సమస్యతో సతమతం- మట్టి రోడ్డు చిత్తడిగా మారడంతో అవస్థలు



బురదగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట జగనన్న కాలనీలో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. కొత్తకోట గ్రామానికి చెందిన సుమారు 243 మంది నిరు పేదలకు గృహ వసతి కల్పించాలన్న సంకల్పంతో గత వైసిపి ప్రభుత్వం రోలుగుంట మండలం దిబ్బలపాలెం గ్రామ సమీపంలో భూ సేకరణ చేసి జగనన్న కాలనీ ఇళ్లు మంజూరు చేసింది. ఇప్పటికే సుమారు 160 మందికి పైగా లబ్ధిదారులు ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకుని అక్కడే నివాసం ఉంటున్నారు. వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్ సరఫరా, రోడ్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన బోరు గత వారం రోజులుగా మరమ్మతుకు గురైంది. దీంతో స్థానికులకు తాగునీటి కొరత ఏర్పడింది. బోరు మరమ్మతులు చేపట్టాలని కొత్తకోట పంచాయతీ పాలకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. తాగు నీటి పథకం ఇంకా నిర్మాణ దశ లో ఉండటంతో నీటి కోసం కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. జగనన్న కాలనీకి రాక పోకలు సాగించేదుకు రహదారి సౌకర్యం లేదు. కొత్తకోట నుంచి దిబ్బలపాలెం వరకు రోడ్డు సదుపాయం ఉంది. దిబ్బలపాలెం గ్రామం నుంచి జగనన్న కాలనీ వరకూ మట్టి రోడ్డు కావడంతో చినుకు పడితే చాలు చిత్తడి, చిత్తడి గా మారుతుంది. దీంతో ఆ రోడ్డు మార్గంలో కాలనీకి వెళ్లే పరిస్థితి లేదు.అంతే కాకుండా కాలనీలో కూడా రోడ్డ సదుపాయం లేదు. వర్షం పడితే ఇంట్లో నుంచి కాలు బయట పెట్టలేని పరిస్థితి ఉంది. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారింది. ఆ దారులలో నడవ లేని దుస్థితి ఉంది. దీంతో కాలనీ వాసులు నిత్యావసర సరుకులకు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్ల లేని పరిస్థితి ఏర్పడింది. తాగునీరు లేక, నిత్యావసర సరుకులు తెచ్చు కోలేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు బాబురావు, రాజేశ్వరి, శ్రీను, లక్ష్మి తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు చేసి నిర్మించు కున్న గృహలలో నివాసం ఉండేందుకు వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సుమారు 160 కుటుంబాలకు తాగు నీరు, రోడ్డు సదుపాయం కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



మరమ్మతుకు నోచిన స్విచ్ బోర్డు



నిలిచిన ట్యాంకు నిర్మాణ పనులు

కొండ ప్రాంతాల్లో జగనన్న కాలనీ స్థలాలు





పాందూరు, రాజుపేటలో ఉన్న జగనన్న కాలనీ లే అవుట్లు

ప్రజాశక్తి -కోటవురట్ల:గత వైసిపి ప్రభుత్వంలో జగనన్న కాలనీల లేఅవుట్లను వేసి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు సగానికి పైగా కొండ ప్రాంతంలో కేటాయించారు. దీంతో, లబ్ధిదారులకు అందించిన పట్టాలను తిరస్కరించారు. మండలంలో అన్నవరం, ఆక్సాహెబ్‌పేట, రామచంద్రపాలెం, బికే పల్లి, రాజుపేట, టీ.జగ్గంపేట, తిమ్మాపురం, పాందూరు, వెంకటాపురం, గ్రామాలకు గత రెవెన్యూ అధికారులు కొండ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు సుముఖత చూపకపోవడంతో ఆయా గ్రామాల్లో నేటికీ నిర్మాణాలు కనీసం మొదలుపెట్టలేదు. ఎండపల్లి, రామచంద్రపురం, రామన్నపాలెం, చినబొడ్డేపల్లి, కైలాసపట్నం, పందూరు, గొట్టువాడ, చౌడువాడ గ్రామాల్లో నిర్మాణాలు కొంతమేర చేపట్టినట్లు తెలిసింది.ఆయా ప్రాంతాలలో ప్రభుత్వం నిధులతో రోడ్లు, విద్యుత్తు, బోర్లు సైతం లక్షల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. అధికారులు శతవిధాలుగా ప్రయత్నం చేసినా నిర్మాణాలు చేపట్టలేదు.మండలంలో జల్లూరు గ్రామానికి లేఅవుట్ ఏర్పాటు చేసినా రోడ్డు లేక నిర్మాణాలు చేపట్టలేదు. తంగేడు గ్రామానికి సంబంధించి కొత్త తంగేడు గ్రామస్తులకు పాత తంగేడులో లేఅవుట్ స్థలం ఏర్పాటు చేయడంతో అక్కడ కూడా నిర్మాణాలు చేపట్టలేదు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

టిడిపి సభ్యత్వాలు నమోదు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని క్రిష్ టౌన్ షిప్ హెూం మంత్రి వంగలపూడి అనిత స్వగృహం వద్ద ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాలకు చెందిన టిడిపి నాయకులు హజరయ్యారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ, అక్టోబర్ 2 నుండి టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, చురుగ్గా చేపట్టాలన్నారు. టీడీపీ కార్యకర్తలకు ప్రస్తుతం రూ. 2 లక్షలు ఉన్న ప్రమాద బీమాను రూ.5లక్షలకు పెంచారన్నారు. టెలిగ్రామ్, వాట్సాప్, గూగుల్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకోవచ్చని ఐ టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటెష్, పెద్దిరెడ్డి చిట్టిబాబు, అమలంకంటి అబద్ధం, జానకి శ్రీను, కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

2013 చట్టం ఉల్లంఘన అన్యాయం

-సిపిఎం నాయకులు, నిర్వాసితులు



మాట్లాడుతున్న నాయకులు, నిర్వాసితులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలం లో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో జరుగుతున్న భూసేకరణలో రెవెన్యూ, ఏపిఐఐసి అధికారులు 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించి, న్యాయస్థానాలు తీర్పులను పట్టించుకోకుండా భూసేకరణ చేపట్టి నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని నాయకులు, నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చందనాడలో ఆదివారం నిర్వాసితులు సమావేశం ఏర్పాటు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, సర్పంచ్ భర్త తళ్ల భార్గవ్, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, నాయకులు అప్పలస్వామి, పుణ్యమంతుల బాబ్జి ,గోవింద్ తదితరులు నిర్వాసితుల సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చి 14 సంవత్సరాలు అవుతున్నా నేటికీ ఒక్కసారి కూడా నిర్వాసితులతో ప్రభుత్వ అధికారులు చర్చలు జరపకపోవడం అన్యాయమన్నారు. ఇది పూర్తిగా చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. ఇక్కడ ఏ విధమైన పరిశ్రమలు ఏర్పాటు చేస్తారో, నిర్వాసితులను ఎలా ఆదుకుంటారో, ప్యాకేజీ ఎంత చెల్లిస్తారో అనేది చర్చలు ద్వారా పరిష్కారం చూపకుండా అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . 2016 వరకూ కోర్టు లో స్టే ఉండటంతో భూ సేకరణ ప్రక్రియ నిలిచిపోయిందని, అటువంటిది 2010ని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి ఎలా కటాఫ్ తేదీగా భావిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, రాజేష్, కృష్ణ, నూకరాజు, అప్పలరాజు, శ్రీను, చిన్న పాల్గొన్నారు.

ఫైబర్ నెట్ పనులు చేస్తూ
గుండెపోటుతో వ్యక్తి మృతి



బాలరాజు మృతదేహం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో రామచంద్రపురం గ్రామంలో బిఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ పనులు చేస్తూ కోటవురట్ల, రాట్నాలపాలెం గ్రామానికి చెందిన పెదపూడి బాలరాజు మృతి చెందాడు. కేబుల్ వైరు పనులు చేస్తూ నిచ్చెన పట్టుకుని ఉన్న సమయంలో ఒక్కసారిగా కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు కోటవురట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తీసుకువెళ్లగా అక్కడ వైద్యులు పరీక్షించి గుండెపోటుతో మరణించినట్లు నిర్ధారించారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. స్థానిక ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



అభినందనలు తెలుపుతున్న నాయకులు

బత్తులను కలిసిన దళిత నాయకులు

ప్రజాశక్తి - మాడుగుల: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబుని ఆదివారం దళిత నాయకులు కలిశారు. రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ కార్యదర్శి మరువాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో మాడుగుల నియోజకవర్గ దళిత నాయకులు కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తులను అధిష్టానం గుర్తించి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మరువాడ ఈశ్వరరావు, దళిత నాయకుడు వరహాల కోటి, టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ రేఖ వెంకటరమణ బాబు, గుమ్మాల అమ్మ తల్లి, జనసేన నాయకుడు కొండలరావు తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న ఎంపిడిఓ



అభినందిస్తున్న శ్రీనివాసరావు

ఆర్‌డిఒ, ఎస్ఐలకు అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నర్సీపట్నం ఆర్‌డిఓ వివి రమణ ను నక్కపల్లి ఎంపీడీవో డి.సీతారామరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్‌డిఓగా రమణ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన నక్కపల్లి తహసీల్దార్ గా పనిచేశారు.ఈ మేరకు ఆర్డిఓ రమణను ఎంపీడీవో సీతారామ రాజు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

చీడికాడ:స్థానిక పోలీస్ స్టేషన్లో నూతన ఎస్ఐ సతీష్‌ని అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు శనివారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిసి సాలువ తో అభినందించారు.

మన్యంలో ఆగని శిశు మరణాలు

ప్రజాశక్తి జిమాడుగుల :మండలంలో బోయితీల పంచాయతీ పులుసుమామిడి గ్రామంలో ఇటీవల కాలంలో వారం రోజుల వ్యవధిలో ఒకే గ్రామంలో అనారోగ్యానికి గురై ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈనెల 22న తోటపల్లి లక్ష్మీపతికి చెందిన నాలుగు నెలల పాప మృతి చెందింది. ఆదివారం అదే గ్రామానికి చెందిన తెరాడా రమేష్ కి చెందిన మూడు నెలల బాబు మృతి చెందాడు. స్థానిక సర్పంచ్ లసంగి మాలన్న స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వైద్య ఉన్నతాధికారులు, సిబ్బంది స్పందించి పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

కారిడార్ నిర్వాసితులపై కటాఫ్ పిడుగు

-భూసేకరణ నోటిఫికేషన్ తేదీని పరిగణనలో తీసుకుని

అర్హుల జాబితా ప్రదర్శన - ఆందోళనలో నిర్వాసితులు

-2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్



ప్రజాశక్తి -నక్కపల్లి: **వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులపై కటాఫ్ పిడుగు పడింది. 14 సంవత్సరాలు కిందట ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్ తేదీని కటాఫ్‌గా పరిగణించి, అప్పటికి 18 సంవత్సరాల నుండి వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించేందుకు అధికారులు అర్హులు జాబితాను సచివాలయాలలో ప్రదర్శించడంతో నిర్వాసితుల్లో ఆందోళన మొదలైంది. దీనిని వ్యతిరేకిస్తూ నిర్వాసితులు ఆందోళన బాట పట్టారు.**

మండలంలోని వేంపాడు, డిఎల్ పురం, చందనాడ, రాజయ్యపేట, బుచ్చిరాజుపేట రెవెన్యూ గ్రామాల్లో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట పరిశ్రమ స్థాపన కోసం ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా సుమారుగా 6 వేల ఎకరాలు భూసేకరణ చేపట్టింది.2010-2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పిసిపిఐఆర్ పేరుతో భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. బలవంతపు భూసేకరణ నిలుపుదల చేయాలని కోరుతూ అప్పటిలో రైతులు అఖిలపక్ష పార్టీల నేతలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు.భూసేకరణకు వ్యతిరేకంగా అనేక దఫాలు ఆందోళనలు చేపట్టారు. భూసేకరణ చేయడంతో తామంతా రోడ్డున పడతామని, భూ సేకరణ నిలుపుదల చేయాలను కోరుతూ అప్పటిలో హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించడంతో భూసేకరణ ప్రక్రియ నిలిచిపోయింది. 2016లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ ప్రక్రియను తిరిగి ముందుకు తీసుకువచ్చి, భూ సేకరణను వేగవంతం చేశారు. ప్రభుత్వం, అధికారుల ఒత్తిడి మేరకు తప్పని సరి పరిస్థితుల్లో ఇష్టం లేకపోయినప్పటికీ భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు వచ్చారు. జిరాయితీ భూములకు ఎకరానికి 30 లక్షలు, దీనితో సమానంగా డీ పట్టా భూములు పరిహారం చెల్లించాలని, 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ చెల్లించాలని నాయకులు, నిర్వాసితులు డిమాండ్ చేసినప్పటికీ, జిరాయితీ భూములకు 18 లక్షలు, డి పట్టా భూములకు 12 లక్షల 60 వేల రూపాయలు చొప్పున మాత్రమే పరిహారం చెల్లించారు. చెట్లకు, ఇళ్లకు తగినంతగా పరిహారం చెల్లించలేదని



కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు (ఫైల్)

నిర్వాసితుల ఆవేదన చెందుతున్నారు. ఇంకా అక్కడక్కడా పెండింగ్‌లో ఉన్న జిరాయితి, సాగు, డీ పట్టాలకు పరిహారం చెల్లించాలని కోరుతూ నిర్వాసితులు ఇటీవల అధికారులకు వినతి పత్రాలు అందజేసారు. ప్రభుత్వం ఇప్పటివరకు రైతుల దగ్గర నుండి భూములను స్వాధీనం చేసుకోలేదు. అయితే ఇటీవలా చందనాడ రెవెన్యూ పరిధిలో ఏపీఐఐసీ అధికారులు కాంట్రాక్టర్ ద్వారా పనులను ప్రారంభిస్తే ,నిర్వాసితులు నాయకులతో కలిసి అడ్డుకున్నారు. సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులను ఏ విధంగా ఆదుకుంటారో, పునరావాసం ఎక్కడ కల్పిస్తారో, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఏ విధంగా చెల్లిస్తారో తెలియ జేయకుండా, చెల్లించకుండా పనులు చేపట్టవద్దని అడ్డుకున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని, రైతుల నుండి భూములను ఎప్పటి నుంచి స్వాధీనం చేసుకుంటారో అప్పటి తేదీని కటాఫ్ గా పరిగణనలోకి తీసుకొని అప్పటికి 18 సంవత్సరాల నిండిన వారందరికీ 15 లక్షలు, ఇల్లులు కోల్పోయిన వారికి 25 లక్షలు ప్యాకేజీ చెల్లించాలని, ఆర్ కార్డులు ఇవ్వాలని, ఏర్పాటు చేయబోయే పరిశ్రమల్లో స్థానికులకు పర్మినెంట్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.

సచివాలయాల వద్ద జాబితా ప్రదర్శన

అధికారులు భూసేకరణ నోటిఫికేషన్ తేదీని పరిగణన లో తీసుకుని భూసేకరణ ప్రభావిత గ్రామాల సచివాలయాల వద్ద ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అర్హుల జాబితాను ప్రదర్శించారు. రాజయ్యపేట రెవెన్యూలో 2010 సెప్టెంబర్ 17, డిఎల్ పురం, బుచ్చిరాజుపేట రెవెన్యూలో 2011 మార్చి 1, వేంపాడు రెవెన్యూలో 2010 డిసెంబర్ 29 నోటిఫికేషన్ ఇచ్చిన తేదీలను అనుసరించి కటాఫ్ తేదీ గా పరిగణించి అప్పటికి 18 సంవత్సరాల నిండిన వారికి పరిహారం చెల్లించేందుకుగాను 735 కుటుంబాలను గుర్తించి ,అర్హుల జాబితాను సచివాలయాల వద్ద ప్రదర్శించి ,అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పేర్కొన్నారు .

రాజయ్యపేట, బోయపాడు 104, డిఎల్ పురం 31, మూలపర్ర, పాటిమీద 196, చందనాడ ,తమ్మయ్యపేట, తుమ్మలపేట 143, బుచ్చి రాజుపేట, కొత్తూరు 172, ల్యాండ్ కొనుగోలు పరిధిలో 89 మొత్తం 735 కుటుంబాలను గుర్తించి , వీరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద 5 కేటగిరీలు కింద ఒక్కొక్కరికి 8 లక్షల 36 వేల చొప్పున చెల్లించనున్నారు. దీనిని నిర్వాసితులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు.

పునరావాసం, పునర్మాణం ప్యాకేజీ, భూములు, చెట్లు, నిర్మాణాలకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి భూములు స్వాధీనం చేసుకునే తేదీని కటాఫ్‌గా పరిగణించి అప్పటికి 18 సంవత్సరాలు నిండి ఇల్లులు కోల్పోతున్న వారికి 25 లక్షలు, ప్రభావిత కుటుంబాలకు 15 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని నిర్వాసితులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పోరాటం తప్పదని హెచ్చరిస్తున్నారు.

చట్ట విరుద్ధంగా భూసేకరణ

వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో నక్కపల్లి మండలంలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియ ప్రారంభం నుంచి 2013 భూసేకరణ చట్టానికి విరుద్ధంగా జరుగుతుంది. ప్యాకేజీ చెల్లించడానికి కూడా నోటిఫికేషన్ ఇచ్చిన తేదీనే కటాఫ్ తేదీ గా నిర్ణయించారు. నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. పునరావాసం, పునర్నిర్మాణం ఎప్పటికైతే పూర్తి చేసి భూములు తీసుకుంటారో దానినే కటాఫ్ తేదీ గా పరిగణించి అప్పటికి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ప్యాకేజీ, ఆర్ కార్డులు ఇవ్వాలి .



ఎం.అప్పలరాజు,
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



అవగాహన కల్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర మాట్లాడుతూ, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తయారు చేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాకర్స్ క్లబ్ సభ్యులు ప్ల కార్డులతో స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ నినాదాలు చేశారు.

వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన సంక్షేమ విద్యాలయాలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ.అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె. కార్తీక్ శ్రీను అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఉన్న విద్యా సంస్థలలో అనేక సమస్యలతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రోజు రోజుకు గిరిజన విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని, సరైన పౌష్టికాహారం లేక అనారోగ్యం పాలవు తున్నారని తెలిపారు. గిరిజన ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో, గురుకులాలలో హెల్త్ వాలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. జీవన్‌కృష్ణ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఉన్న విద్యా సంస్థలలో స్థానికంగా ఉన్నటువంటి అధ్యాపకులను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి.చిన్నారావు, పి.సింహాద్రి, పి.అన్నబాబు, జ్యోతి, కాంచుల, ప్రసాద్, దిలీప్, గణేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబరాన్ని తాకిన కళా సంబరం

-ఉత్సాహంగా ఉపకార్ మీడియా అవార్డ్స్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఉపకార్ ట్రస్ట్, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన జాతీయ కళా సంబరం అంబరాన్ని తాకింది. ఖర్గపూర్, వెస్ట్ బెంగాల్ కు చెందిన రిథమ్ డాన్స్ అకాడమీ గణేష్ వందన రూపక ముతో ఆరంభమైన ఈ కళా సంబరం అధ్యంతం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకిత్తించింది. విశాఖకు చెందిన స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ కళాకారులు ఆర్‌హెచ్ టీనా,జి. డింపుల్,డి.స్నేహిత, పూజిత చందన బందం చేసిన ఒడిస్సి శాస్త్రీయ నత్యం, మణిపూరీ జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అదేవిధంగా నగరానికి చెందిన ప్రవల్లిక బృందం చేసిన కోలాటం మన సాంప్రదాయ విశిష్టతను చాటి చెప్పాయి. స్నేహాంజలి ఆర్ట్స్ అకాడమీ కళాకారులు చేసిన కాళికా విజయం, సంబల్పూర్‌కు చెందిన అలోక్ పండా బృందం చేసిన ఒడిస్సా గిరిజన నృత్యాలు, కోల్‌కతాకు చెందిన దేశోప్రియ, కల్చరల్ సెంటర్ సుస్మిత బెనర్జీ బృందం చేసిన కథక్, దేశభక్తి ప్రబోధ నృత్యాలు శహబాష్ అనిపించుకున్నాయి. ఖరగపూర్ కళాబృందం, నవ్య డాన్స్ అకాడమీ కళాకారులు చేసిన జానపద, శాస్త్రీయ నృత్యాలు, సాంప్రదాయ నృత్య సృజనాత్మకతను చాటి చెప్పాయి. ఉపకార్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్చుతరావు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, జాతీయ జర్నలిస్ట్‌ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు,కెవిఆర్ అధినేత కాయల వెంకట రెడ్డి,అంతర్జాతీయ గుర్తింపు పొందిన జానపద నృత్య దర్శకుడు ఆర్.నాగరాజు పట్నాయక్ సంధాన కర్తగా, అద్యాంతం ఈ కళా సంబరాన్ని ప్రేక్షకులు మెచ్చే విధంగా తీర్చిదిద్దారు. జర్నలిస్టులను సత్కరించారు.



జర్నలిస్టులను సత్కరిస్తున్న నాయకులు



నృత్యం చేస్తున్న కళాకారులు